



కౌలు రైతులకు మంచిరోజులు

ప్రభుత్వ ఆదేశాలతో రుణార్హత కార్డులు

ఎన్నికల సమయంలో హామీ

వైసీపీ ప్రభుత్వంలో కౌలు వ్యవస్థ కుదేలు

భీమవరం రూరల్, జూలై 9 : కౌలు రైతులకు మంచి రోజులు రానున్నాయి. రుణ అర్హత కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ దిశగా రెవెన్యూ వ్యవసాయ శాఖలకు దిశా నిర్దేశం చేసింది. క్షేత్ర స్థాయిలో కౌలు రైతులను గుర్తించి రుణ అర్హత కార్డులు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో రైతులను ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. కౌలు రైతులకు సాయం చేస్తామని స్పష్టం చేసింది. రుణ అర్హత కార్డులు ద్వారా కౌలు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రతీ గ్రూపుకు రుణాలు మంజూరు చేస్తారు. వ్యవసాయ యాంత్రిక పనిముట్లు సబ్సిడీతో అందిస్తారు. టీడీపీ ప్రభుత్వం గతంలోను ఇలాంటి విధానాన్ని అనుసరించింది. కౌలు రైతులకు గ్రూపులుగా రుణాలు ఇవ్వడంలో లక్ష్యాలను నిర్దేశించింది. ఫలితంగా సాగు కోసం పెట్టుబడికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వచ్చేవి. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే బీమా సౌకర్యం వర్తించేది. ఇన్ని విధాలుగా లాభదాయకమైన రుణ అర్హత కార్డులను వైసీపీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. రుణాలు ఇవ్వలేదు. కౌలు వ్యవస్థను పూర్తిగా దెబ్బ తీసింది. కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు చేయూతనిచ్చే దిశగా అడుగులు వేస్తున్నది.

సాగులో 70 శాతం కౌలు రైతులే..

వరి, ఆక్వా ఇతర పంటల్లో 70 శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో కౌలు రైతులకు చేయూతనిచ్చే కార్యక్రమాలే జరిగాయి. అప్పటి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్షా 20 వేలకు పైగా కౌలు రైతులకు రుణ అర్హతకార్డులు అందించారు. 70 వేల మందిపైగా కౌలు రైతు గ్రూపులకు 50 శాతం సబ్సిడీలో వరికోత యంత్రాలు, మినీ ట్రాక్టర్‌లు, యాంత్రిక పనిముట్లు అందించారు.

వదిలేసిన వైసీపీ ప్రభుత్వం

కౌలు రైతులకు గత వైసీపీ ప్రభుత్వం చేయూత నిలిపింది. గ్రూపు రుణాలు లేవు. యాంత్రిక పనిముట్లు సబ్సిడీ ఇటు రైతులకు, అటూ కౌలు రైతులకు ఆపేసింది. గడిచిన ఐదేళ్లలో కౌలు రైతులు సాగుకు దూరం అవుతూ వచ్చారు. సాగు చేసిన కౌలు రైతుకు ప్రకృతి వైపరీత్యాలు వలన కలిగిన పంట నష్టానికి పరిహారం రాలేదు. దీంతో కౌలు రైతులకు అప్పుల మిగిలాయి. చివరికి కౌలు రైతులు సాగుకు ముందుకు రాక పోవడంతో కౌలు పడిపోయింది.



వారం రోజుల క్రితం నరసాపురం ఎమ్మెల్యే నాయకర్ పాలకొల్లు రోడ్‌లోని ఏఎంసీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ..సమయంలో ప్రాంగణంలో వృథాగా పడి ఉన్న ఐరన్ గుట్టలను చూశారు. దీనిపై ఆరా తీశారు. మూడేళ్లుగా ఇలా వృథాగా పడి ఉందని సిబ్బంది సమాధానం ఇవ్వడంతో దీనిపై ఆయన గృహనిర్మాణ సిబ్బందిపై సీరియస్ అయ్యారు. చివరికి ఒక్క నరసాపురంలోనే కాదు.. తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం ప్రాంతాల్లో సుమారు 500 టన్నుల పైనే ఐరన్ ఇలా వృథాగా పడి ఉందని చెప్పడంతో షాక్ తిన్నారు.

దొరికినంత దోచేశారు..

నరసాపురంలో పునాదుల వద్దే నిలిచిపోయిన జగనన్న ఇళ్లు



ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో నిరుపయోగంగా పడి ఉన్న ఐరన్

జగనన్న ఇళ్ల నిర్మాణంలో మాయాజాలం

కమీషన్లకు కక్కుర్తిపడి ఐరన్ కొనుగోలు

జిల్లాలో 500 టన్నులపైనే వృథా

కలగానే పేదోడి ఇంటి నిర్మాణం

ఐరన్ క్వాలిటీ పరీక్షలకు అధికారులు సిద్ధం

నరసాపురం, జూలై 9: గత ప్రభుత్వం హయాంలో స్థలాలు కొనుగోలు, పూడిక, గృహ నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. అయిన కాడికి దోచేశారు. అందులో ఐరన్ కూడా ఒకటి. అవసరం లేకుండానే కమీషన్లకు కక్కుర్తిపడి పెద్ద మొత్తాల్లో కొనుగోలు చేసి వాటిని సరఫరా చేశారు. ఇలా వచ్చిన ఐరన్ చాలా చోట్ల వృథాగా పడి ఉంది. కొన్ని చోట్ల తుప్పు పట్టిపోయింది. అందులో జిల్లాకు వచ్చిన ఐరన్ కూడా వృథా అయింది. ఒక్క నరసాపురంలోనే సుమారు 150 టన్నులు, భీమవరంలో 300, తణుకులో 71, ఉండిలో 81 టన్నులు వృథాగా ఉంది. ప్రభుత్వం మారడంతో ఈ జాబితాను సిద్ధం చేసి సంబంధింత శాఖకు నివేదించారు.

11 వేల ఇళ్లకు కొనుగోలు చేసిన ఐరన్

గత ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చింది. దానిలో భాగంగా కట్టుకోలేని లబ్ధి దారులకు తామే నిర్మించి ఇస్తామని చెప్పింది. జిల్లాలో జగనన్న పథకం కింద మొత్తం 72 వేలు ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 11 వేల మంది తము కట్టుకోలేమని ప్రభుత్వానికి తెలియజేశారు. వీరికి ఇళ్లు నిర్మించే బాధ్యతను ప్రభుత్వం ఏజెన్సీలకు అప్పగించింది. నరసాపురంలో అత్యధికంగా 4 వేల ఇళ్లు నిర్మించాల్సి ఉంది. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ 2.16 లక్షలు చెల్లించే విధంగా ఏజెన్సీలతో ఒప్పందం చేసుకుంది. ఇందులో 1.80 లక్షలు కేంద్రం ఇచ్చే నిధులుకాగా మిగిలిన రూ.30 వేలు స్వయం సహాయ సంఘం నుంచి లబ్ధిదారులు ఏజెన్సీకి చెల్లించనున్నారు. ఇందుకు ప్రభుత్వం ఈ ఏజెన్సీలకు ఐరన్, సిమెంట్, ఇసుక, ఇతర మెటీరీయల్‌ను సబ్సిడీపై సరఫరా చేస్తుంది. ఏజెన్సీలు లేబర్, మిషనరీని వినియోగించి ఇళ్లు నిర్మించాల్సి ఉంది.

పునాదుల్లోనే నిర్మాణాలు

మొదట్లో ఉత్సాహంగా కట్టేందుకు వచ్చిన ఏజెన్సీలు పునాది దశలోనే వెనుదిరిగాయి. కొన్నిచోట్ల బేస్ మెంట్ వేసి చేతులు దులుపుకున్నారు. అయితే ఈ ఏజెన్సీల మీద నమ్మకంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఐరెన్ సరఫరా చేసింది. వీటిని ముందుగా ఆ కాలనీల వద్ద భద్రపర్చుకున్నారు. అయితే ఆరు నెలల్లో పనులు ముందుకు సాగకపోవడంతో హౌసింగ్ అధికారులు వచ్చిన ఐరన్‌ను మార్కెట్‌యార్డు, ఇతర ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో భద్రపర్చారు. సిమెంట్‌ను మాత్రం అప్పగించ లేదు. ఈ విధంగా జిల్లాలో 500 టన్నులపైనే ఐరెన్ వృథాగా పడి ఉంది. నిర్మాణాలు పూర్తికాకపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఏజెన్సీలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం స్థలాలు సేకరించిదే తప్ప వాటిలో చాలాచోట్ల పూడిక చేపట్టలేదు. కొన్ని చోట్ల రోడ్లు లేవు. ఈ కారణంగా ఏజెన్సీ మిషనరీ, ఇతర సామాగ్రిని తరలించేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వర్షాకాలమైతే కాలనీల్లో రెండు మూడు అడుగులు నీరు నిలిచిపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఏడాదిన్నర నుంచి హౌసింగ్ ఆధికారులు ఈ పనులపై సంబంధిత ఏజెన్సీలను ఎన్నిసార్లు సంప్రదించినా వారి నుంచి స్పందన లేదు. నరసాపురంలో 4 వేలు ఇళ్లు నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా 240 ఇళ్ల నిర్మాణాలు పునాదులు దాటగా 270 బేస్‌మెంట్ లెవల్‌లోనే ఉన్నాయి. మిగిలినవి ప్రారంభానికి నోచుకోలేదు. తణుకు, భీమవరం, ఉండి ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి.

ఐరన్‌ను ల్యాబ్‌కు పంపి పరీక్షిస్తాం

రెండేళ్లుగా ఐరన్ వృథాగా పడి ఉండటం వల్ల తుప్పు పట్టింది. దీన్ని సామర్థ్యాన్ని పరీక్షించేందుకు మూడో పార్టీ క్వాలిటీ కంట్రోల్ పరీక్షకు పంపిస్తాం. వారి సూచనలు, సలహాలు మేరకు ఐరన్ వినియోగిస్తాం. నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడం వల్ల ఎన్ని టన్నుల ఐరన్ మిగిలిందన్న విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. దానికి అనుగుణంగా ముందుకు సాగుతాం.

- వెంకటేశ్వరావు, హౌసింగ్ డీఈ



మునిసిపల్ కమిషనర్లు, పబ్లిక్‌హెల్త్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పారిశుధ్య పనులు వేగవంతం చెయ్యండి

మునిసిపల్ కమిషనర్లను ఆదేశించిన కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 9 : సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు విస్తృత పారిశుధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మున్సిపల్,పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షించారు. వర్షాకాలంలో డయేరియా, డెంగీ జ్వరాలు తదితర వ్యాధులు అపరిశుభ్రత, నీటి కలుషితం కారణంగా ప్రబలుతాయి. ఎక్కడా చెత్తకుప్పలు, తాగునీటి పైప్‌లైన్‌లు లీకేజీలు లేకుండా చూడాలి. వీధుల్లో, షాపులు ముందు, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే చెత్త వేసేలా ప్రజలో అవగాహన కల్పించాలి. తడి, పొడి చెత్తలను వేరువేరుగా ఉంచి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ నరసింహ రాజు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్, భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామల, ఈఈ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.సాయంత్రం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, ఇఓపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలతో సమీక్షించారు. గ్రామాల్లో చెత్త మేట వేసిన ప్రదేశాలను గుర్తించి జేసీబీల ద్వారా తరలించాలన్నారు.స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా అందించిన ఫాగింగ్ మిషన్‌లు, తదితర పనిముట్లను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ఒలింపిక్స్ పతకమే లక్ష్యం 7
అథ్లెట్ దండి జ్యోతికశ్రీ



ఫీజులపై గుబులు

జిల్లాలో ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బకాయిల కోసం యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది.ఇది గత వైసీపీ ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. అంతే..ఫీజులు ఖరారు విషయంలో పక్షపాతం చూపారు. ఏడాదికి రూ. 95 వేలు ఉన్న ఫీజును రూ.45 వేలకు తగ్గించారు. ఫీజు నిర్ధారణ కమిటీ నిర్ణయాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గతంలో నిర్ధారించిన ఫీజులనే ఇప్పుడు కూడా ఖరారు చేస్తే ఇబ్బందులు తప్పవంటూ కళాశాలల యాజమాన్యాలు ఆందోళనలో ఉన్నాయి.



ప్రస్తుతానికి పాత విధానమేనంటూ సంకేతాలు

అదే జరిగితే నష్టపోతామంటూ

ఇంజనీరింగ్ యాజమాన్యాల గగ్గోలు

వైసీపీ హయాంలో కోర్టుకు వెళ్లారని ఫీజుల్లో కోత

కక్ష పూరితంగా వ్యవహరించిన నాటి ప్రభుత్వం

కొత్త ప్రభుత్వం సవరిస్తుందని ఎదురుచూపులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం ఫీజులు చెల్లింపులో కళాశాలలను ఇబ్బందులు పెట్టింది. తల్లుల ఖాతాలో జమ చేసేది. ఆ సొమ్ములు కళాశాలలకు అందడంలో జాప్యం జరిగేది. దీనివల్ల ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు డిగ్రీ, ఇతర కళాశాలలు కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాయి. మరోవైపు విద్యార్థులకు కూడా సంతృప్తి లేకుండా పోయింది. ఇంజనీరింగ్ కళాశాలల విషయంలో బ్యాంకులు కూడా రుణం ఇచ్చేందుకు వెనుకంజ వేస్తున్నాయి.

ఫీజుల విషయంలో మీమాంస

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో అన్ని కళాశాలల యాజమాన్యాలు ఊపిరి పీల్చుకున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులు వస్తాయని ఆశిస్తున్నాయి అయితే గతేడాది మాదిరిగానే పాత ఫీజులను ప్రస్తుతానికి అమలు చేయాలంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్న సంకేతాలు యాజమాన్యాలకు అందాయి. అదే ఇప్పుడు వారిని పట్టిపీడిస్తోంది. విద్యార్థులపై భారం పడకుండా పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం చెప్పుకొచ్చింది. అందుకోసం కళాశాలల ఫీజులను తగ్గించింది. అంతకు ముందున్న ప్రభుత్వాలు అమలు చేసే ఫీజుల్లో కోత విధించింది. అయితే మేనేజ్‌మెంట్ కోటాలో మాత్రం కళాశాలకు ఉన్న ఫీజుకు మూడింతలు వసూలు చేసుకోవచ్చని సూచించింది. మేనేజ్‌మెంట్ కోటాలో 30 శాతం సీట్లున్నాయి. దాంతో సొమ్ములు చెల్లించి చదువు కోవాలనుకున్న విద్యార్థులకు ఆర్థికంగా కష్టమైంది. ప్రధానంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదువు పూర్తి చేయాలంటే ప్రధాన కళాశాలల్లో సగటున రూ.16 లక్షలు అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత ఈసీఈ కోర్సుకు డిమాండ్ ఉంది. అందులోనూ పెద్దమొత్తంలోనే వసూలు చేస్తున్నాయి. కంప్యూటర్ సైన్స్ ఇన్ఫర్మేషన్ సైన్స్ టెక్నాలజీ ఆధారిత కోర్సులను కళాశాలల్లో పెంచారు. విద్యార్థులు కూడా వాటిపైనే మోజు చూపుతున్నారు. మేనేజ్‌మెంట్ సీట్లలో చేరుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలు వాటిపైనే ఆధారపడుతున్నాయి. మెకానికల్ వంటి కోర్సుల్లో సీట్లను కుదించేశాయి. తగ్గించుకున్నాయి. మేనేజ్ మెంట్ సీట్ల విషయంలోనూ పెద్దగా మోజు ఉండడం లేదు. కేవలం కంప్యూ టర్ సైన్స్ ఆధారిత కోర్సుల వల్లే కళాశాలలు నిర్వహించగలుగుతున్నా మంటూ యాజమాన్యాలు చెపుతున్నాయి.

గతంలో విధానం ఇలా

గతంలో తెలుగుదేశం ఫీజు నిర్ధారణ కమిటికీ అనుగుణంగా నిర్ణయం తీసుకునేది. కళాశాలల ఖాతాల్లోనే ఫీజులు జమచేసేది.విద్యార్థులకు, తల్లి దండ్రులకు పెద్ద సమస్య ఉండేది కాదు.చదువు పూర్తిచేసుకుని సర్టిఫికెట్‌లు తీసుకునేవారు. వైసీపీ హయాంలో తల్లుల ఖాతాలో జమ చేశారు. అది కూడా సకాలంలో ఫీజులు ఇవ్వలేదు. ఫలితంగా చదువు పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి నేరుగా కళాశాలలు ఫీజులు వసూలు చేసేవి. ఆలా కట్టిన విద్యార్థులకు మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తున్నాయి. ఈఏడాది కూడా బకాయిలు ఉండిపోవడంతో కళాశాలలు సర్టిఫికెట్‌లు ఇవ్వలేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ కళాశా లలకు విజ్ఞప్తి చేశారు. సర్టిఫికెట్‌లు మంజూరు చేయాలని ఆదేశించారు.



అయితే గతంలో తెలుగుదేశం అమలు చేసిన ఫీజుల విధానంపై యాజమాన్యాలు సంతృప్తిగా ఉండేవి.అప్పట్లో 10 వేల ర్యాంకు వరకు పూర్తి స్థాయిలో ప్రభుత్వమే ఫీజు చెల్లించేది.ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసేది. మిగిలిన విద్యార్థులకు రూ.40 వేల వరకు ఫీజు చెల్లిస్తూ వచ్చింది. ప్రభుత్వం నిర్ధారించిన ఫీజు ప్రకారం మిగిలిన మొత్తాన్ని విద్యార్థులు భరించేవారు. యాజమాన్యాలకు ఆర్థికంగా ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడదే విధానం అమలు చేస్తే బీసీ, ఆర్థికంగా వెనుకపడిన విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అటు యాజమాన్యాలకు, ఇటు విద్యార్థులకు ఆమోదయోగ్యమైన ఫీజు విధానాన్ని అమలు చేయాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే కళాశాలల మనుగడ ఆధారపడి ఉంది.

చెత్తగుట్ట మాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పారిశుధ్య పరిస్థితులపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'సీజనల్ డేంజర్' కథనంపై అధికారులు స్పందించారు. భీమవరం రూరల్ మండలం కరుకువాడలో రహదారి పక్కన ఉన్న చెత్తను తొలగించారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు కార్యదర్శి తెలిపారు.

-భీమవరం రూరల్

చేపల చెరువులకు అనుమతి.. చేసేది రొయ్యల సాగు

ఫిర్యాదును పరిశీలించిన సబ్ కలెక్టర్

పెనుమంట్ర, జూలై 9 :పెనుమంట్ర మండలం నెలమూరులో చేపల చెరువులకు అనుమతులు తీసుకుని వనామీ సాగు చేస్తున్నారని యరకరాజు సుబ్బరాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నరసాపురం సబ్ కలెక్టర్ అచ్యుత అంబరేష్ మంగళవారం నెలమూరులోని రొయ్యల చెరువులను పరిశీలించారు. సుబ్బ రాజును సమస్య అడిగి తెలుసుకున్నారు. భట్ల మగుటూరు మురుగు కాల్వగట్లనే చెరువు గట్లుగా మలుచుకున్నారని దీంతో గట్లు కాలవలోకి జారిపోవడంతో వర్షం నీరు దిగువకు వెళ్లక పంట పొలాలు మునిగిపోతున్నాయని వివరించారు. గతంలో అనుమతి లేని బోర్ల ద్వారా ఆక్వా సాగు చేశారని ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ సాల్ట్ బోర్లను తొలగించాలని ఆదేశించి నప్పటికీ తొమ్మిది బోర్లు మాత్రమే తొలగించి మిగిలిన వాటి ద్వారా వనామి సాగు చేస్తున్నారని వివరించారు. ఈ సంఘటనలపై సమగ్ర విచారణ చేసి నివేదిక నివ్వాలని తహసీల్దార్ కళ్యాణిని సబ్ కలెక్టర్ ఆదేశించారు.



నెలమూరులో చేపల చెరువులపై వివరాలు సేకరిస్తున్న సబ్ కలెక్టర్

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

పెనుమంట్ర, జూలై 9 :పెనుమంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అతిసార వ్యాధి, డెంగీ, మలేరియా లక్షణాల గురించి ప్రజలకు వివరించి వ్యాధుల పట్ల ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.హైరిస్క్ గర్భిణుల రిజిస్టర్లను పరిశీలించారు. సీజనల్ వ్యాధు లపై గ్రామాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచనలు చేశారు. ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను గుర్తించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటి కప్పుడు క్లోరినేషన్ చేయించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు కె.లావణ్య కనకప్రియ పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఒలింపిక్స్ పతకమే లక్ష్యంగా..


పరుగు తీస్తున్న జ్యోతికశ్రీ

- నాన్న ప్రోత్సహమే కొండంత అండ : అథ్లెట్ దండి జ్యోతికశ్రీ

తణుకు, జూలై 9 : ఆమె పేరు దండి జ్యోతిక శ్రీ. ఈనెల 26 నుంచి పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో 4x400 మీటర్ల రిలే పరుగు పందెం పోటీలకు అర్హత సాధించారు. ఈ పోటీల్లో పతకం సాధించడమే తన లక్ష్యమని, ఎలాగైనా సాధించి తీరుతానని ఆమె దృఢంగా విశ్వసిస్తు న్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణా నికి చెందిన ఆమె తల్లి లక్ష్మి, తండ్రి శ్రీనివాసరా వు. 2000 జూలై 16వ తేదీన ఆమె జన్మించారు. తండ్రి బాడీ బిల్డర్. ఆయనే ఆమెకు మొదటి కోచ్. కుమార్తె స్కూల్లో చదువుకునే సమయంలో క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించి జ్యోతిక శ్రీని ప్రోత్సహించారు. ఆమె 13వ ఏట నుంచి శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. తణుకు మాంటిస్సోరి స్కూలులో ప్రాథమిక విద్య పదో తరగతి వరకు చదివింది. ఆమెకు కోచ్ సీతారామయ్య శిక్షణ ఇచ్చారు. స్కూలు యాజమాన్యం జ్యోతిక శ్రీని ప్రోత్సహించడం కలిసి వచ్చింది. విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో ఇంటర్ చదువుతుండగా అక్కడ కోచ్ వినాయక్ ప్రసాద్ సారథ్యంలో మెలకువలు నేర్చుకుంది. తర్వాత హైదరాబాద్ గోపీచంద్ మైత్రా అథ్లెటిక్స్ ప్రాజెక్టులో భాగంగా కోచ్ నాగపురి రమేశ్ వద్ద శిక్షణ తీసుకున్నారు.

ఎన్నో పతకాలు సాధించి..

2017లో ప్రపంచ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో 400 మీటర్ల రిలేలో ప్రాతినిధ్యం వహించింది. 2021లో అండర్-23 మహిళల 400 మీటర్ల పరుగులో నేషనల్ చాంపియన్ షిప్ సాధించింది. 2023లో జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్, ఇండియన్ గ్రాండ్ ప్రి-2, 4 పోటీల్లో బంగారు పతకాలు గెలుచుకుంది. ఆసియన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ వరల్డ్ రిలే చాంపియన్ షిప్‌ల్లో సత్తా చాటి ప్రస్తుత ఒలింపిక్స్‌కి అర్హత సాధించింది.

నాన్న ప్రోత్సాహమే

'ఈ రోజు ఒలిపింక్స్‌లో ఆడేందుకు అర్హత సాధించానంటే ఇది అమ్మ లక్ష్మి, నాన్న శ్రీనివాసరావుల ప్రోత్సాహమే. చిన్నతనం నుంచి నాలో వున్న క్రీడాసక్తిని గుర్తించి నాన్న ఎప్పటికప్పుడు ప్రోత్సహించేవారు. క్రీడాకారుడు కావడం వల్లే అదే స్ఫూర్తితో నేను అథ్లెటిక్ కావాలనుకున్నా. ఆయనే నా మొదటి కోచ్. కొన్నేళ్లుగా దేశం తరఫున ఎన్నో పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించాను. ఇప్పుడు నా ముందున్న లక్ష్యం ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే. ఇందు కోసం సిద్ధమవుతున్నా' అని జ్యోతికశ్రీ అన్నారు. 'మా అమ్మాయి ఒలింపిక్స్‌కు ఎంపిక కావడం ఎంతో గర్వకారణంగా వుంది. ఆమె కచ్చితంగా పతకం సాధిస్తుందన్న నమ్మకం వుంది. చిన్న వయసు నుంచి అటు చదువులోను, ఇటు క్రీడల్లోనూ రాణిస్తూ మెరుగైన ఫలితాలు సాధించింది' అని తండ్రి శ్రీనివాసరావు తెలిపారు.

రేపు డీఎల్‌టీసీలో జాబ్‌మేళా

ఏలూరు అర్బన్, జూలై 9 : ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ జిల్లాస్థాయి శిక్షణ సంస్థ (డీఎల్‌టీసీ)లో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు హాజరయ్యే ఈ జాబ్‌మేళాకు ఐటీఐ ఉత్తీర్ణులై, అప్రెంటీస్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థుల తోపాటు, ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న ట్రైనీలు హాజరుకావచ్చన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఐడీ ప్రూఫ్‌లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని.. వివరాలకు 89776 18713లో సంప్రదించాలని సూచించారు.

'శ్రేష్ట'లో గురుకుల విద్యార్థికి జాతీయ స్థాయి ర్యాంకు


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పెదవేగి, జూలై 9:నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ నిర్వహించిన శ్రేష్ట ప్రవేశ పరీక్షలో పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థి లకారపు రిత్విక్ జాతీయస్థాయి ర్యాంకు సాధించాడు. సమిశ్రగూడేనికి చెందిన లకారపు రిత్విక్ ప్రస్తుత విద్యా సంవత్సరంలో పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గతేడాది మేనెలలో కేంద్ర సామాజిక న్యాయం-సాధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ద్వారా నిర్వహించిన నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ట ప్రవేశ పరీక్షలో జాతీయస్థాయిలో 354వ ర్యాంకు సాధించాడు. రిత్విక్ తండ్రి శ్రీహరి ప్రసాదబాబు ఆర్టీసీ డ్రైవర్‌కాగా, తల్లి సోమాలమ్మ గృహిణి. సోదరి స్నిగ్ధశ్రీ పాలిటెక్నిక్ చదువుతోంది. ఎస్సీ సామాజిక వర్గం విద్యార్థులు కార్పొరేట్ విద్యను అందుకోవడానికి అనువుగా ప్రభుత్వం 2022 విద్యా సంవత్సరంలో శ్రేష్ట పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రేష్టలో జాతీయ ర్యాంకు సాధించిన రిత్విక్ కార్పొరేట్ పాఠశాలలో ఉచిత విద్య, వసతి, పూర్తి సౌకర్యాలను అందుకుంటాడన్నారు. రిత్విక్‌ను వైస్ ప్రిన్సిపాల్ వైవీఎస్.ఆచార్యులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

వైజ్ఞానిక స్పృహతోనే దేశాభివృద్ధి సాధ్యం


ధ్రువపత్రాలను అందుకున్న విద్యార్థులతో ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 9 : విద్యార్థులు బాల్యం నుంచే తమ ఆలోచనలకు పదును పెట్టాలని, వైజ్ఞానిక స్పృహతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్, ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఇన్‌స్పైర్ మనాక్ మెంటర్‌షిప్- 2024' అనే అంశంపై ఏపీ నిట్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకత ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడ తాయన్నారు. నేషనల్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ అసోసియేయట్ డాక్టర్ సునీల్ భాస్కర్, సైంటిఫిక్ స్టూడెంట్స్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్.జీ.శ్రీనివాస్, ఎస్ఈఆర్‌టీ స్టేట్ నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భాగ్యశ్రీ, డాక్టర్ మేరీ మాట్లాడుతూ విద్యార్థుల భాగ సామ్యంతోనే దేశప్రగతి సాధ్యమన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన 24 మంది విద్యార్థులు ఆగస్టులో ఢిల్లీలో తమ ఆవిష్కరణలను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ పి.శంకర్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ శ్రీఫణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలకు కేంద్ర ప్రభుత్వం అధికప్రాధాన్యం

ఉండి జూలై 9: కేంద్ర ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని ఉండి కేవీకే ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డాక్టర్ మల్లికా ర్జునరావు అన్నారు. మంగళవారం ఉండిలో స్వర్ణోత్సవ జ్యోతియాత్ర ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉండి కేవీకే నుంచి ఘంటశాలకు స్వర్ణోత్సవ జ్యోతియాత్రను తీసుకుని వెళ్లి అందజేసినట్టు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉండి కేవీకే 1995లో ప్రారంభించి రైతులకు అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఉద్యానం, చేపలు, రొయ్యలు, తేనెటీగల, పుట్టగొడుగుల పెంపకంవంటి అనేక వృత్తి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే ప్రాణాపాయం తప్పదు. ఈ విషయాన్ని గమనించి రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే ఈ ప్రమాదాల కారణంగా ఎందరో చనిపోయారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పూర్తిగా వ్యవసాయ ప్రాంతం కావడంతో తరచూ పొలాల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా పామాయిల్ తోటల్లో గెలలు కోసే సమయంలోనే విద్యుత్ తీగలు తగిలి పలువురు మృత్యువాత పడ్డారు. మరోవైపు ఇళ్లల్లోనూ విద్యుత్ వైరింగ్ సరిగా లేక షార్ట్ సర్క్యూట్ వల్ల మరికొందరు బలయ్యారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- అనధికారికంగా మరెందరో బలి
- రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- కాలం చెల్లిన వైర్లు, స్తంభాలు కారణాలే
- అప్రమత్తత లేక మరికొన్ని ప్రమాదాలు

ఏలూరుసిటీ, జూలై 9 : విద్యుత్ ప్రమాదాలు ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయంలోనైనా జరగవచ్చు. తుఫాన్ల సమయంలో ఈదురుగాలులు వీచి విద్యుత్ తీగలు తెగిన సందర్భంలోను, సాంకేతిక ఇబ్బందులు కారణంగా కండక్టర్లు తెగి రహదారులపై పడినప్పుడు వాటిని తగలడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదానికి గురవ్వాల్సిందే. ఎప్పుడో వేసిన విద్యుత్ లైన్లు వేసిన చోట్ల పామాయిల్ తోటలు విరివిగా పెరగటం, వాటి గెలలు కోసే సమయంలో ఆ కోసే వస్తువులు తీగలకు తగలడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలు అరికట్టటానికి విద్యుత్ శాఖ చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరగటం శోచనీయం. విద్యుత్ వైర్లలో నాణ్యత లోపించిందా అన్న విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి.

ఈ ప్రమాదాల్లో మనుషులే కాదు జంతువులు బలవుతున్నాయి. పంట పొలాల్లో గడ్డి మేసే సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలు వల్ల పశువులు మృత్యువాత పడుతున్నాయి.

ఏటా పెరుగుతున్న ప్రమాదాలు..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. 2021-22లో 54 మంది వ్యక్తులు మృతి చెందగా, 2022-23లో 47 మంది.. 2023-24లో ఇప్పటి వరకు 36 మంది చనిపోయారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

అందించిన నష్ట పరిహారం ఇలా..

విద్యుత్ ప్రమాదాలు జరిగిన వెంటనే నష్టపరిహారం కోసం అధికారులు కృషి చేస్తారు. కాని పరిహారం రావటానికి జాప్యం జరుగుతూనే ఉంటుంది. 2021 నుంచి 24 సంవత్సరాల మధ్య విద్యుత్ ప్రమాదాల వల్ల 137 మంది వ్యక్తులు మృతి చెందగా వారికి సంబంధించి మొత్తం నష్టపరిహారంగా రూ.2.75 కోట్లు వరకు బాధిత కుటుంబాలకు అందజేశారు. 2021-22లో 54 మంది మృతి చెందగా, రూ.1.64 కోట్ల నష్ట పరిహారం బాధిత కుటుంబాలకు అందజేశారు. 2022-23లో 47 మంది మృతి చెందగా రూ.80.70 లక్షల పరిహారం, 2023-24లో ఇప్పటి వరకు 36 మంది మృతి చెందగా రూ.30.30 లక్షల నష్టపరిహారాన్ని అందజేశారు.

మూడేళ్లలో 137 మంది మృత్యువాత

లెక్కకు రాని ప్రమాదాలు అనేకం..

సాధారణంగా పంట పొలాల్లో విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఇందులో కొన్ని మాత్రమే లెక్కకు వస్తుంటాయిని, మరికొన్ని ప్రమాదాలు లెక్కల్లో కనిపించవనే విమర్శలు వినిపిస్తుంటాయి. విద్యుత్ అధికారుల నివేదికలకంటే అధికంగానే ప్రమాదాలు జరిగే ఉండవచ్చన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. విద్యుత్ ప్రమాదాలను నివారించడం కోసం అధికారులు ఎప్పటికప్పుడు విద్యుత్ కండక్టర్లను మారుస్తూనే ఉన్నారు. అయినా ప్రమాదాలు జరుగుతున్నాయంటే కారణం ఏమిటో తెలుసుకుని అధికారులు సత్వరం చర్యలు చేపట్టాలని ఉమ్మడి పశ్చిమ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రైతులకు/ రైతు కూలీలకు సూచనలు..


- వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటార్ స్టార్టర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయాలి. విద్యుత్ షాక్ తగులకుండా ఉండేందుకు 30 ఎంఎ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీని మాత్రమే ఉపయోగించాలి.
- పామాయిల్ తోటలలో గెలలు కోసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. గెలలు కోసే ముందు రైతులు విద్యుత్ సిబ్బందికి తెలపాలి. ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగి పడితే వెంటనే విద్యుత్ కాల్ సెంటర్ నంబరు 1912కు ఫోన్ ద్వారా తెలపాలి.
- ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించే ప్రయత్నంలో చేతులతో తాకకుండా ఎండుకర్రతో విద్యుత్ తీగను ప్రమాదానికి గురైన వ్యక్తి నుంచి వేరుచేయాలి. ఇన్సులేషన్ పాడైన విద్యుత్ వైర్లను ఇన్సులేషన్ టేప్‌తో మాత్రమే చుట్టాలి.

గృహ వినియోగదారులకు సూచనలు

- ఇంటికి ఎర్తింగ్ ఇచ్చినప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్‌లను అమర్చాలి. అసాధారణ శబ్దాలు గ్రైండర్, ఏసీ, రిఫ్రిజిరేటర్‌లో వచ్చి నప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే నైపుణ్యం కలిగిన వారి చేత పరీక్షించాలి.
- ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజ్‌వైర్లు/ టెంపరరీగా అనేకమైన పరికరాలను కలపకూడదు. ప్లగ్‌ను తీయునప్పుడు వైరును లాగరాదు. ఇళ్ళల్లో 30ఎమ్ యాంప్ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీ/ ఈఎల్‌సీబీలను వినియోగించుకోవాలి.

వాణిజ్య/పరిశ్రమల వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కరెంటుకు సంబంధించిన ఏ పని చేసేటప్పుడైనా విధిగా చెప్పులు, చేతి తొడుగులు ధరించి చేయాలి. కాటన్ మిల్స్ వారు ప్యానల్ బోర్డు మీద మోటార్ల మీద కాటన్ డస్టు పార్టికల్స్ లోనికి వెళ్ళకుండా తగు జాగ్రత్త వహించాలి. అన్ని స్విచ్ బోర్డులకు పానెల్ బోర్డులు ముందు రబ్బరు మాట్లు విధిగా ఏర్పాటు చేయాలి.


పోలవరం దిగువ కాఫర్ డ్యాం వద్ద గోదావరి జలాల ఉధృతి


పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద నీటి పరవళ్లు

నిలకడగా గోదావరి

పోలవరం, జూలై 9 : పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి నిలకడగా మారింది. స్పిల్వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్వేలో సాధారణ నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.520 మీటర్లు, స్పిల్వే దిగువన 16.540 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 26.580 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 15.400 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 6,018 క్యూసెక్కుల విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వలకు విడుదల చేశామని పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు మంగళవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 14.802 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. ఈనెలలో ఇప్పటివరకు 2.4060 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు.


జిల్లా కలెక్టర్‌ను కలిసి నూతన న్యాయమూర్తులు

కలెక్టర్‌ను కలసిన నూతన న్యాయమూర్తులు

ఏలూరు క్రైం, జూలై 9 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ కోర్టులలో నియమించబడిన నూతన న్యాయమూర్తులు మంగళవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ కోర్టులలో నియమించబడిన న్యాయమూర్తులు పీవీ నాగరంజిత్‌కుమార్ (తణుకు), కాళహస్తి రాజరాజేశ్వరి తేజస్వి (జంగారెడ్డిగూడెం), వీఎస్ఎన్ లక్ష్మీ లావణ్య (పాలకొల్లు), బండి రచన (ఏలూరు)లు ఉన్నారు. అనంతరం రెవెన్యూ అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో న్యాయమూర్తులు పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారిణి డి.పుష్పమణి, ఏలూరు రెవెన్యూ డివిజినల్ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల తగ్గింపునకు సహకరిస్తాం

- మంత్రి నాదెండ్లను కలసిన చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు


మంత్రి నాదెండ్లను సత్కరిస్తున్న ఛాంబర్స్, కామర్స్ నాయకులు

ఏలూరు రూరల్, జూలై 9: నిత్యావసరాలైన కందిపప్పు, బియ్యం, తక్కువ ధరకు ప్రజలకు అందించేందుకు సహకరిస్తామని వెస్ట్ గోదావరి అసోసియేటెడ్ మర్చంట్స్ చాంబర్ ఏలూరు, వెస్ట్ గోదావరి ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ కామర్స్ ఇండస్ట్రీ నాయకులు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు హామీ ఇచ్చారు. మంగళవారం అమరావతిలో మంత్రి నాదెండ్లను వారు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రజలకు నిత్యావసరాలైన కందిపప్పు, బియ్యం ఎక్కువ ధరలు ఉన్నందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజారులో రేషన్‌కార్డులు ద్వారా నాణ్యమైన ధరలకు విక్రయించేందుకు వర్తకులు, రైస్‌మిల్లర్లు సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి వారిని కోరారు. ఏపీ సివిల్‌సప్లై ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల ధరలపై వర్తక సమావేశం జరిగింది. సమావేశానికి ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు హాజరయ్యారు. అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కర్‌రావు, అన్నిజిల్లాల వర్తక ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన కేజీ కందిపప్పు రూ.160, బియ్యం ఒక రకం రూ.49, మరోరకం రూ.48 చొప్పున ప్రత్యేక కౌంటర్ ద్వారా అమ్మేందుకు సహకరిస్తారని మంత్రికి స్పష్టం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఛాంబర్ ప్రధాన కార్యదర్శి వంకాయల రామకృష్ణ, దాల్ మిల్లర్స్ తరపున మద్దుల సత్యకుమార్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి

- పశ్చిమ గోదావరి జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరంటౌన్, జూలై 9 : బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు వర్తకులు సహకారం అందించుటకు ముందుకు రావాలని జిల్లా జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయం వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులు, రిటైల్ అమ్మకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువులు ధర స్థిరీకరణపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని రైతు బజార్లు, డీ-మార్టు, రిలయన్స్ సూపరుమార్కెట్ల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, ధరల వివరాలు అందరికీ కనబడేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బియ్యం, కందిపప్పును ప్రజానీకానికి మార్కెటు ధరల కంటే తక్కువ ధరకు అమ్మకాలు చేయాలన్నారు. దీనికి అవసరమైన చర్యలను చేపట్టేందుకు మార్కెటింగు, సివిల్ సప్లై శాఖ, రైస్, పప్పులు, ఆయిల్, కూరగాయలు, రిటైల్ వ్యాపారస్తులకు ఉల్లి, టమాట ధరలు నియంత్రణకు చేపట్టవలసిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వేంకటేశ్వరరావు, డీఎస్‌వో యన్.సరోజ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణలో ఎన్యూమరేషన్ కచ్చితంగా ఉండాలి

జాతీయ రహదారుల భూసేకరణలో ఎన్యుమరేషన్ ఖచ్చితత్వంతో నిర్వహించాలని జేసీ ప్రవీణ్‌ఆదిత్య సర్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో సర్వే అధికారులతో ఆయన సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవేస్ భూసేకరణలో భాగంగా ఆయా భూముల్లో ఉన్న ఇళ్ళు, షెడ్లు, చెట్లు వంటి వాటిని కచ్చితంగా లెక్కించాలన్నారు.

మూడేళ్ల తర్వాత తల్లి చెంతకు బాలుడు

- అధికారులను అభినందించిన కలెక్టర్ వెట్రిసెల్వి


తప్పిపోయిన బాలుడు నందకిషోర్‌ను తల్లికి అప్పగించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం/ బుట్టాయగూడెం, జూలై 9 : ఇంటి నుంచి మూడేళ్ల క్రితం వెళ్లిన గిరిజన బాలుడు తల్లి చెంతకు చేరుకున్న ఘటన మంగళవారం జరిగింది. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బాలుడిని తల్లికి అప్పగించారు. బుట్టాయగూడెం మండలం మర్లగూ డెంకు చెందిన కొవ్వాసి మహాలక్ష్మి, శ్రీను దంపతుల కుమారుడు కొవ్వాసి నందకిషోర్. మూడేళ్ల క్రితం జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతిలో తల్లిదండ్రులు చేర్చారు. చదువుపై ఇష్టంలేని బాలుడు కొన్ని రోజుల తర్వాత ఇంటికి వచ్చి.. తర్వాత ఇంటి నుంచి 2021లో పారిపోయాడు. గతంలో పలుమార్లు పారిపోయిన బాలుడు ఇంటికి వచ్చే అలవాటు ఉండడంతో ఈసారి కూడా ఇంటికి వస్తాడని ఆశించిన తల్లికి నిరాశే మిగిలింది. ఎట్టకేలకు వారం రోజుల క్రితం ఆ పన్నెండేళ్ల బాలుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరా రైల్వేస్టేషన్‌లో ఉన్నట్టు అక్కడ సీడబ్ల్యూసీ ద్వారా ఏలూరు డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటక్షన్ యూనిట్‌కు సమాచారం అందింది. స్పందించిన ఐసీడీఎస్ అధికారిణుల ఆదేశాల మేరకు బుట్టాయగూడెం ఐసీడీఎస్ సిబ్బందితో సంప్రదించి తల్లితో ఆ బాలుడిని వీడియో కాల్ ద్వారా మాట్లాడించి గుర్తించారు. ఆమె తన కుమారుడిని తీసుకురావాలని కోరడంతో ఈనెల ఎనిమిదో తేదీన ఏలూరు జిల్లా కేంద్రానికి రప్పించారు. మంగళవారం కలెక్టర్ సమక్షంలో అతడిని తల్లి మహాలక్ష్మికి అప్పగించారు. సుదీర్ఘ కాలంగా దూరమైన కొడుకు అధికారుల కృషి వల్ల తిరిగి తన వద్దకు చేరడంతో ఆ తల్లి ఎంతో సంతోషపడింది. బాలుడి వివరాలు గుర్తించి క్షేమంగా తల్లికి అందించిన ఏలూరు జిల్లా డీసీపీవో, ఐసీడీఎస్ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో పీడీ పీవీఎల్ పద్మావతి, బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి, సీడీపీవో తులసీ, కేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీకాంత్, సూపర్‌వైజర్ కె.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథుడు


వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల, జూలై 9 : శ్రీజగన్నాథుని రథోత్సవాల్లో భాగంగా జరుగుతున్న అలంకార మహోత్సవాలు భక్తులను అలరిస్తున్నాయి. ఈక్ర మంలో లక్ష్మీసమేతంగా కొలువై శంఖు చక్రాలను ధరించి అభయహస్తాన్ని ప్రసాదిస్తూ.. వరాహావతారంగా స్వామివారు మంగళవారం భక్తులను అనుగ్రహించారు. పురాతన లక్ష్మీపురం ఆలయ ప్రాంగణంలోని మండపంలో జగన్నాథుడు రోజుకో అలంకరణలో సాక్షాత్కరిస్తున్నారు, వరాహ రూపంలో ఉన్న స్వామిని భక్తులు దర్శించి తరించారు.

డబ్బులివ్వలేదని నగల కోసం మహిళ హత్య

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 9: తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్లలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఆరుగొలనుకు చెందిన జానపాముల సత్యవతి(45)ని నగల కోసం హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. పట్టణ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలివి.. ఆరుగొలనుకు చెందిన సత్యవతికి అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చిక్కాల శ్రీనుకొండయ్యకు గత పదేళ్లుగా పరిచయం ఉంది. ఆమె ఈనెల ఒకటో తేదీన ఆటోలో బంధువుల ఇంటిలో ఫంక్షన్‌కు వెళ్లగా.. అతడు మాట్లాడే పనుందని తాడేపల్లిగూడెం రమ్మన్నాడు. ఆమె దర్శిపర్రు నుంచి తాడేపల్లిగూడెంలో దిగి శ్రీనుకొండయ్యతో కలిసి నవాబుపాలెం వెళ్లింది. అతడు తనకు అర్జెంటుగా రూ.10వేలు కావాలని అడగగా తన దగ్గర డబ్బులు లేవని ఆమె చెప్పడంతో మెడలో నగలను చూసి వాటిపై కన్నేసి నిడదవోలు వెళ్దామని చెప్పి బైక్‌పై ఆరుళ్ల గ్రామానికి తీసుకెళ్లాడు. అక్కడ మళ్లీ డబ్బులు ఇవ్వాలని గొడవకు దిగగా.. ఆమె వారించడంతో పక్కనే ఉన్న కాల్వ తుప్పల్లోకి నెట్టి గొంతు నులిమి హత్యచేశాడు. అనంతరం ఆమె మెడలోని నగలు తీసుకుని పరారయ్యాడు. సత్యవతి కనిపించడంలేదని బంధువుల ఫిర్యాదుతో సీఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా సెల్‌ఫోన్ ఆధారంగా అతడిపై అనుమానంతో విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. ఈ మేరకు హత్యకేసుగా నమోదు చేసి అతడిని అరెస్టు చేశామని సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు.

క్రైం కార్నర్

మద్యం తాగొద్దన్నందుకు..

- తల్లి, చెల్లి, బావ, అమ్మమ్మపై కత్తితో కుమారుడి దాడి
- బుట్టాయగూడెం సీహెచ్‌సీలో చికిత్స


ఆసుపత్రిలో బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం, జూలై 9 :చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని.. మద్యం తాగొద్దని వారించినందుకు తల్లి, చెల్లి, బావ, అమ్మమ్మలపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన సోమవారం అర్ధరాత్రి బుట్టాయగూడెం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. అచ్చియ్యపాలెంకు చెందిన ములపర్తి పద్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం పద్మ వద్ద కుమార్తె దివ్య కుమారుడు రాజు, తల్లి చిడిపి దుర్గమ్మ ఉంటున్నారు. ఏలేటి చంద్రశేఖర్‌తో స్నేహం చేస్తూ రాజు చెడు అలవాట్లకు బానిసయ్యాడు. వ్యసనాలకు దూరంగా ఉండాలని తల్లి మందలించడంతో పలుమార్లు చంపుతానని బెదించేవాడు. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. మద్యం మత్తులో ఉన్న అతడు కుటుంబ సభ్యులపై గొడవకు దిగాడు. అనంతరం అతడి స్నేహితుడు ఏలేటి చంద్రశేఖర్ అలియాస్ చంటితో కలిసి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నలుగురు కళ్లల్లో కారం చల్లి చాకుతో విచక్షణ రహితంగా దాడిచేయడంతో తల్లి, చెల్లి, బావ, అమ్మమ్మలకు గాయాలయ్యాయి. గాయపడినవారిని 108లో బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా డాక్టరు హేమంత్‌కుమార్ బాధితులకు చికిత్స చేశారు. బాధితురాలి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకన్న తెలిపారు.

వెనుక నుంచి మోటారు సైకిల్ ఢీ.. ఒకరి మృతి


పద్మారావు (ఫైల్)

పెనుగొండ, జూలై 9 : మోటారు సైకిల్ ఢీ కొన్న ప్రమాదంలో సైకిలిస్టు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పెనుగొండ పోలీసులు తెలిపిన వివరాలివి.. సిద్ధాంతం గ్రామానికి చెందిన సలాది పద్మారావు(85) అనే వ్యక్తి సోమవారం రాత్రి సిద్ధాంతం భారత్ పెట్రోల్‌బంక్ సమీపం నుంచి సైకిల్‌పై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మోటారు సైకిల్ వేగంగా ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో తణుకు ఆసుపత్రికి తరలిం చినట్లు తెలిపారు. మార్గమధ్యలో పద్మారావు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, జూలై 9 : రోడ్డు దాటుతున్న ఒక వృద్ధురాలిని అతి వేగంగా వెళ్తున్న మోటారుసైకిలిస్టు ఢీ కొనడంతో ఆమె మృతి చెందింది. ఏలూరులోని చిట్టివలసపాకలకు చెందిన చిరంది సత్యవతి(80) ఏలూరు లోబ్రిడ్జి వద్ద మొక్కజొన్న పొత్తులు కాల్చి విక్రయిస్తూ జీవితం గడుపుతుంది. మంగళవారం మధ్యాహ్నం ఏలూరు వసంతమహల్ వద్ద రోడ్డు దాటుతుండగా ఓ గుర్తుతెలియని మోటారు సైకిలిస్టు అతివేగంగా ఢీకొని వెళ్ళిపోయాడు. తీవ్ర గాయాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

మద్యం బాటిల్స్ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 9 : అధిక మొత్తంలో మద్యం బాటిల్స్‌ను మోటారు సైకిల్‌పై తీసుకువెళ్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు వంగాయిగూడెం సెంటర్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ నవీన్‌కుమార్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన బండారు నాగేంద్రబాబు మోటారు సైకిల్‌పై అనుమానాస్పదంగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతడి వద్ద 215 మద్యం బాటిల్స్ ఉండడాన్ని గుర్తించి అరెస్టు చేశారు. ఎందుకు, ఎక్కడకు తీసుకువెళ్తున్నాడనే దానిపై దర్యాప్తు చేపట్టారు.

గీత వృత్తిని కాపాడాలి

నరసాపురం టౌన్, జూలై 9: తాటిచెట్లకు రక్షణతో పాటు కల్లుగీత వృత్తిని ప్రభుత్వం కాపాడాలని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి అన్నారు. మంగళవారం మీరా గ్రంథాలయంలో గీత కార్మిక సమావేశానికి ఆయన అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడబడితే అక్కడ తాటిచెట్లను నరికేస్తున్నారన్నారు. పాలకులు కార్పొరేట్ సంస్థలకు భూములు ఇవ్వడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల గీత వృత్తి దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కల్లుగీత వృత్తిని కాపాడి, సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలన్నారు.

హైవేపై పెండింగ్ పనులు పూర్తి చేయాలి


ఎమ్మెల్యేకు బొకే అందిస్తున్న హైవే భద్రత అధికారులు

నరసాపురం టౌన్, జూలై 9: పట్టణంలో 216 హైవే రహదారిపై పెండింగ్ పనులు తక్షణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయకర్ ఆదేశించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో హైవే భద్రత అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించారు. అనంతరం వారితో మాట్లాడుతూ పట్టణంలో అనేకచోట్ల డ్రెయినేజీల అనుసంధానం జరగలేదన్నారు. ఈకారణంగా కొద్దిపాటి వర్షం వస్తే వార్డులు ముంపుబారిన పడుతున్నాయన్నారు. హైవే రోడ్డులో విద్యుత్ లైట్లతో పాటు తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

రత్నమాణిక్యం మృతదేహానికి నివాళులు

ఆకివీడు, జూలై 9: గుమ్ములూరు మాజీ సర్పంచ్ కోపల్లె రత్నమాణిక్యం పార్థీవదేహంపై పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు నివాళులు అర్పించారు. రత్నమాణిక్యం గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, టీడీపీ మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, మండల కన్వీనర్ దారపు రెడ్డి కన్నబాబు, మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ అజ్మల్ తదితరులు నివాళులు అర్పించారు.

రైతులు పరిశుభ్రత పాటించాలి

ఆకివీడు, జూలై 9: రైతులు పరిశుభ్రత పాటించకపోతే పశువులు వ్యాధుల బారిన పడతాయని భీమవరం ఉప సంచాలకులు డాక్టర్ జవహర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం పెదకాపవరంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల శిక్షిత్స శిబిరం మండల వెటర్నరీ వైద్యాధికారి కెల్లా భార్గవిసత్య నేతృత్వంలో నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి, పాతపాటి శ్రీనివాసరాజు, డాక్టర్లు జేసు రత్నం, వర ప్రసాద్, హేమ, చంద్రబాబు పాల్గొన్నారు.

సహాయనిధికి రూ.50వేల చెక్కు అందజేత


రూ.50వేల చెక్కు అందించిన కల్యాణ్‌వర్మ

ఉండి జూలై 9: ఉండి నియోజకవర్గ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహాయ నిధికి రూ.50ల చెక్కును ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజుకు ఉపసర్పంచ్ కల్యాణ్‌వర్మ అందించారు. ఈ సందర్భంగా కల్యాణ్‌వర్మ, వార్డుసభ్యుడు దాట్ల శ్రీనివాసరాజు తదితరులు ఎమ్మెల్యేతో పలు విషయాలు చర్చించారు. గ్రామంలో ఉప్పుగుంట వెళ్లే రహదారిలో డంపింగ్‌యార్డు వలన సమస్యగా మారిందని దానిని ఉండి-గణపవరం రహదారికి మార్చాలని కోరారు. ఉండి పంచాయతీకి పర్మినెంట్ సెక్రటరీని నియమించాలని కోరారు.

దోమలు నివారించాలి

ఉండి జూలై 9: డెంగీ నివారణకు ఇంటి పరిసరాలలో దోమల పెరుగుదల నివారణ చర్యలు తీసుకోవాలని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ జెన్నీశామ్యూల్ అన్నారు. మంగళవారం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శామ్యూల్ మాట్లాడుతూ డెంగీకి కారణమయ్యే ఎడిస్ దోమ పగటిపూట మాత్రమే సంచరించడం జరుగుతుందన్నారు. నీటి నిల్వలు, అపరిశుభ్రత పరిసరాలను గుర్తించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది జ్వరాలపై సర్వే విధిగా చేయాలని డాక్టర్ కోరారు.

కలెక్టర్‌కు రాజ్యాంగ పుస్తకం అందజేత

భీమవరం టౌన్, జూలై 9 : జిల్లా కలెక్టర్ నాగరాణిని దళిత నాయకులు మంగళవారంనాడు మర్యాదపూర్వకంగా కలిసి భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందజేశారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, పాలపర్తి జొనా, గొల్లా రాజ్ కుమార్, ఆలమూరి బాబ్జీ, మరపట్ల మునియ్య పాల్గొన్నారు.

బుడగ, బేడ జంగాల సమస్యలు పరిష్కరించాలి

ఉండి జూలై 9: బుడగ, బేడ జంగాల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకునివెళ్లి వారి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు. మండల సీపీఐ కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ బుడగ, బేడ జంగాలను ఎస్సీలుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలన్నారు.

బొండాడ డ్రెయిన్‌లో తూడు తొలగింపు పనులు


తొలగించిన తూడును ట్రాక్టర్‌పైకి ఎక్కిస్తున్న దృశ్యం

ఉండి జూలై 9: నియోజకవర్గంలో మేజర్ డ్రెయిన్‌గా వున్న బొండాడ డ్రెయిన్‌లో పేరుకున్న గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆదేశాలతో డ్రెయిన్స్ అభివృద్ధి పనులను చేపట్టినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, డ్రెయినేజీ డీఈ సుబ్రమణ్యేశ్వరరావు, ప్రకాశ్ వివరించారు. ఉండి నుంచి వెలివర్రు వెళ్లే వంతెన, ఉండి ఇరిగేషన్ కార్యాలయం వద్ద అక్విడెక్టు వద్ద పేరుకున్న చెత్తను తొలగించే పనులు చేరుకుగా జరుగుతున్నాయి. ఈ పనులను వాండ్రం రైల్వేగేట్ వరకు చేపట్టి పూర్తిచేయడం జరుగుతుందన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత పనులు


ఇందిరమ్మ కాలనీలో డ్రెయిన్లలో పూడికతీస్తున్న ఉపాధి కూలీలు

గణపవరం, జూలై 9:గణపవరంలోని ఇందిరమ్మ కాలనీలో డ్రెయినేజీలు పూడుకుపోయి, మురుగు ప్రవాహానికి ఆటంకంగా తయారయ్యాయి. అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రం ఉండడంతో డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోందని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. ఈసమస్యలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఉపాధి కూలీలతో కాలనీలో ఉన్న డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, పూడికపనులను స్థానిక జనసేన నాయకుడు తోట పవన్ పర్యవేక్షణలో అధికారులు పనుల కొనసాగించారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

వీరవాసరం,(భీమవరంటౌన్) జూలై 9: రాయకుదురు గ్రామం జిల్లా పరిషత్ హైస్కులులో నిర్వహించబడుతున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు పాలకొల్లు పట్టణానికి చెందిన దాత వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ 10వేల రూపాయల ఆర్థిక సహాయంతో బోటనీ, జువాలజీలకు సంబంధించి రికార్డులను అందించారు ప్రిన్సిపాల్ కానుకొలను శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రోత్సాహకులు పీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమా శంకరం పి.గురుమూర్తి, పూర్ణచంద్రరావు, సాకా వర ప్రసాద్, బాలకృష్ణ, నాగకు మా ర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక పాలసీ అభినందనీయం

టీడీపీ నాయకుల హర్షం


ఆచంటలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

భీమవరం అర్బన్, జూలై 9: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఎన్డీఏ ప్రభుత్వం నెలరోజులలోనే అమలులోకి తెచ్చిందన్నారు. జీఓ నెం 43ని విడుదల చేసి బడుగు బలహీన సామాన్య ప్రజల అభ్యున్నతికి బాట వేశారన్నారు. వైసీపీ పాలనలో పేదల ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఖర్చు అయితే అందులో రూ.3లక్షల ఇసుకకే ఖర్చు చేయాల్సి వచ్చేదని పేర్కొన్నారు.

భీమవరం అర్బన్: ఇసుక పాలసీపై జీవో విడుదల చేయడంతో పేదల సొంత ఇంటి కల నెరవేరుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి చంద్రబాబు ఇసుకను ఉచితంగా అందిస్తునారన్నారు. దీంతో ఇప్పటి వరకు కుదేలైన భవన నిర్మాణ రంగం ఊపందుకోనున్నదని చెప్పారు.

ఆచంట: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసి తీసుకురావడం అభినందనీయమని మండల టీడీపీ అధ్యక్షుడు కేతా మీరయ్య అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక పాలసి విధానంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందన్నారు.

పాలకొల్లు టౌన్: ఉచిత ఇసుక విధానం అమలు వల్ల పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజలకు లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ, మండలాల టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కోడి విజయభాస్కర్, మామిడిశెట్టి పెద్దిరాజు అన్నారు. ఉచిత ఇసుక అమలుపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడారు.

నరసాపురం టౌన్: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం వల్ల రాష్ట్రంలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దొరకడంతో పాటు నిర్మాణదారులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామ రాజు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుకను దోచుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కృత్రిమ కొరత సృష్టించి అయినకాడికి దోచేశారన్నారు. కార్యక్రమంలో అగ్నికులక్షత్రీయ రాష్ట్ర సాధికార కన్వీనర్ రవి, పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానంపై కార్మికుల హర్షం

ఇరగవరం, జూలై 9 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. ఇసుక అందుబాటులోకి రావడంతో భవన నిర్మాణ రంగ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో నిర్మాణాలకు ఇసుక దొరక్క భవన నిర్మాణం కుదేలయ్యింది. ప్రజలు ఇంటి నిర్మాణానికి ఇసుక కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. దీనికితోడు ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మడంతో సామాన్యుడు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా పనులు లేక ఎంతో మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇసుక కొరతను తీర్చి తమను ఆదుకోవాలని ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించు కోలేదు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేయడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చేతి నిండా పని



వైసీపీ అయిదేళ్ల పాలనలో భవన నిర్మాణ కార్మికులు పడిన కష్టాలకు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడింది. ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఉచిత ఇసుక విధానంతో అందరికీ చేతినిండా పనులు దొరుకుతాయి.

- నాగరాజు, భవన నిర్మాణ సంఘ జిల్లా అధ్యక్షుడు

వలస వెళ్లే పని లేదు



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం వల్ల ఇక నుంచి మాకు రోజూ పని లభిస్తుంది. పనుల కోసం వలస వెళ్లే పరిస్థితి ఇప్పుడు లేదు. గత ప్రభుత్వ హయాంలో పనులు లేక ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. మా కష్టాలు తీరడం ఆనందంగా ఉంది.

- శ్యాంబాబు, పెయింటింగ్ మేస్త్రీ

18 నుంచి కుష్ఠువ్యాధిపై ఇంటింటా సర్వే

భీమవరంటౌన్, జూలై 9 : జిల్లాలో కుష్ఠువ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని డీఆర్వో జె.భాస్కరరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో కుష్ఠువ్యాధి నిర్మూలనపై సమన్వయకమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి వచ్చేనెల 2 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతీ పాఠశాలలో ప్రతీ విద్యార్థులను తనిఖీ చేసి, స్పర్శ లేని మచ్చలు, ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే గుర్తించాలన్నారు. కుష్ఠువ్యాధిని ముందుగానే గుర్తించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని అన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లల సంఖ్య పెంచాలి

ఆకివీడు, జూలై 9: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను తమసొంత పిల్లలా చూసుకొంటూ మంచి విద్యా బోధన చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వాణి వెంకటరత్నం అన్నారు. మంగళవారం ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు మండలాల అంగన్‌వాడీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల నమోదు పెంచాలని, యాప్‌లు అప్‌డేట్ చేయాలని, బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. మెనూ సక్రమంగా అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ రత్నకుమారి, డీఈవో రజనీ తదితరులు ఉన్నారు.

పల్లపు ప్రాంతాల్లో నీటి తోడకం

ఉండి జూలై 9: కొద్ది రోజుల నుంచి కుస్తున్న వర్షాలతో గ్రామంలో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. దీనితో జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు, సర్పంచ్ సుబ్బలక్ష్మి మంగళవారం ఆయా ప్రాంతాలు పరిశీలించారు. వర్షపు నీటిని బయటకు తరలించే విధంగా మోటర్ ఇంజన్ సహాయంతో చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు. అన్నిచోట్ల కచ్చా డ్రెయిన్లు తవ్వించి మురుగునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నీట మునిగిన రహదారులు


వేండ్రలో నీట మునిగిన రహదారి

పాలకోడేరు, జూలై 9: వేండ్ర గ్రామంలో కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి రహదారులు నీటమునిగాయి. గ్రామంలోని దళితపేటలో ఏ రహదారి చూసినా వర్షపునీటితో చెరువులను తలపిస్తున్నాయి. దళితవాడను చేర్చి కొత్త కాలనీ ఏర్పాటు చేయడంతో దళిత కాలనీ మీద కొత్త కాలనీ ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు ఎటూ వెళ్ళని పరిస్థితి. ఉదయం కురిసిన వర్షపునీరు సాయంత్రం అయినా రహదారులపై నిలిచి ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వర్షపునీరు వెళ్ళే మార్గాన్ని చూడాలని పంచాయతీ అధికారులకు, పాలకులకు తెలియజేయడంతో తాత్కాలికంగా మురుగు వెళ్ళే మార్గాన్ని పంచాయతీ పాలకులు కొన్నిరోజుల క్రితం ఎక్స్‌వేటర్లతో తవ్వించారు. దీంతో మురుగునీరు కాస్త బయటకు వెళ్ళిపోయాయి. కానీ కొత్తకాలనీకి వెళ్ళే ప్రాంతంలో మురుగు వెళ్ళకుండ అడ్డుకట్ట వేసేయడంతో ఆ సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది.

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

భీమవరం అర్బన్, జూలై 9: ఫెడరల్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకులు పి.నాగేశ్వరరావు, ఏఐటీయుసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరంలో బ్యాంకు వద్ద ఆందోళన చేశారు.

సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు అనుమతి

భీమవరం టౌన్, జూలై 9: జిల్లా విభజన అనంతరం పశ్చిమగోదావరి జిల్లాలో కూడా ప్రత్యేకంగా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతి మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ నిర్మాణ పనులు జరుగుతాయని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిధులను సమకూరుస్తుందని తెలిపారు. యువతలో నైపుణ్య అభివృద్ధిని పెంచి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ శిక్షణ సంస్థ ఉపయోగంగా ఉంటుందన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి


లంకలకోడేరు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లక్ష్మీభార్గవి

పాలకోడేరు, జూలై 9: ప్రతీ గర్భిణీ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవా లని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ. రంగం నాయుడు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ (పీఎంఎస్ ఎంఏ) కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వీరవాసరం,(భీవరంటౌన్) : కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారంనాడు గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్ సుగర్, బడ్ల గ్రూపింగ్, వీడిఆర్ఎల్, హెచ్ఐవి, మలేరియా పరీక్షలు చేశారు. 55మంది గర్భిణులకు వైద్యసేవలు చేశారు. అనంతరం 55 మందికి తులసీ కళ్యాణమండప యాజమాని మల్లా రాంబాబు అందించిన పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు యు వవనీత్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ లక్ష్మీభార్గవి అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీలో మంగళవారం డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీ భార్గవి గర్భిణులను పరీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.


భీమవరంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను మర్యాదపూర్వకంగా కలసి ఫ్లాగ్‌టవర్ చిత్రపటాన్ని అందిస్తున్న వడ్డి సుబ్బారావు

ప్రతి వారం అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి , ఈతకోట తాతాజీ

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 9: రాష్ట్రంలో అన్నక్యాంటీన్లు ప్రారంభమయ్యే వరకు పట్టణంలో అన్న క్యాంటీన్ వద్ద ప్రతి మంగళవారం అన్న సమారాధన జరుగుతుందని నియోజకవర్గ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలో గల అన్న క్యాంటిన్ వద్ద మంగళవారం వలవల బాబ్జి సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. వచ్చే మంగళవారం అన్నసమారాధనకు అయ్యే ఖర్చు తాను భరిస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రకటించారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, వర్తనపల్లి కాశి, దాసరి కృష్ణవేణి, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ సామాజిక బాధ్యత

భీమవరం టౌన్, జూలై 9 : జనాభా నియంత్రణ సామాజిక బాధ్యత అని, ఏ దేశ ప్రగతి అయినా ఆ దేశ జనాభాపై ఆధారపడి ఉంటుందని భీమవరం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జి. బాలకృష్ణంరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అధిక జనాభా గల దేశాల్లో అభివృద్ధి కుంటిపడి అనేక ఇబ్బందుల్లో ఉంటున్నారని అన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించే ప్రపంచ జనాభా దినోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీలు, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహిస్తామని అన్నారు. నరహరిశెట్టి కృష్ణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుల్లి రామయ్య సేవలు మరువలేనివి


బోళ్ళ బుల్లిరామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు, జూలై 9: సమాజ సేవలో ప్రముఖ పారిశ్రామిక వేత్త, కేంద్ర మాజీ మంత్రి బోళ్ళ బుల్లిరామయ్య సేవలు మరువలేనివని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం బోళ్ళ జయంతి సందర్భంగా పార్టీ పట్టణ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, తాతపూడి మారుతీరావు, కడియాల సూర్యనారాయణ, ఒమ్మి రాంబాబు, వల్లూరి గంగయ్య, గుబ్బల శ్రీనివాసు, గుమ్మళ్ళ హనుమంతు తదితరులు పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బోళ్ళ చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి నివాళులర్పించారు. అనంతరం తణుకు కేంద్ర ఆసుపత్రి స్త్రీల వార్డులో బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణ, డాక్టర్ ఎస్. రామకృష్ణ, సంఘ కోశాధికారి అర్థి భాస్కరరావు, చలపతిరావు, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, జూలై 9: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులకు మంగళవారం డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు సంఘ కార్యాలయంలో వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు కోసూరి గాంధీ, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా: బొలిశెట్టి

పెంటపాడు, జూలై 9: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తమ సమస్యలు చెప్పుకునేందుకు ఏ సమయంలో అయినా తనను కలవవచ్చునని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ప్రజా దర్బారు నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తేగా ప్రతి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి ఇక నుంచి అన్ని గ్రామాల్లోను ప్రజా దర్బారు నిర్వహిస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి బొలిశెట్టి పూజలు

పెంటపాడు, జూలై 9: వారాహి అమ్మవారి దీవెనలతో ప్రజలంతా క్షేమంగా ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మంగళవారం పట్టణం లోని వానపల్లి గూడెంలో ఉన్న వారాహి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 9: పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరాకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ సూచించారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. ఈవోపీఆర్డీ వెంకటేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజా శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె



భీమవరం టౌన్, జూలై 9: మెంటేవారితోటలోని బాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి భక్తులు ఆషాడం సారెను మంగళవారంనాడు అందించారు. పట్టణానికి చెందిన తోటకూర కృష్ణ, ఫణిలక్ష్మి దంపతులచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 108 మంది మహిళ భక్తులచే 108 రకాల స్వీట్స్ పండ్లు, పూలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి సారె అందించి భక్తులకు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి లోకేశ్‌ను కలసిన ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు

తణుకు, జూలై 9: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేశ్‌ను విజయవాడలో ఆయన చాంబర్‌లో కలసి విన్నవించినట్టు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నేలపాటి వెంకట రమణ తెలిపారు. 117 జీవో రద్దు చేయాలని, స్కూలుకు ఆగిపోయిన మెయింటెనెన్సు గ్రాంటు విడుదల చేయాలని, నాడు-నేడు నిర్మాణ బాధ్యతల నుంచి ప్రధానోపాధ్యాయులను తప్పించాలని విన్నవించినట్టు పేర్కొన్నారు. పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతృమూర్తి పేరిట అన్నదానం

భీమవరం టౌన్ ,జూలై 9 : మునిసిపల్ మాజీ కౌన్సిలర్ మెంటే కాశీ విశ్వేశ్వరరావు (గోపి) సోదరులు పూర్ణ హరి కుటుంబ సభ్యులు వారి మాతృమూర్తి మంగతాయారు పేరిట భీమవరం కొత్త బస్టాండ్‌లో 100 మంది దివ్యంగులు, పేదవారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, నరహరి శెట్టి కృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

పెనుగొండ, జూలై 9: దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేయడం ద్వారా వారు మరింత ఆరోగ్యవంతంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జగదీశ్ అబ్బిరాజు తెలిపారు. వడలి గ్రామం ఎంపీపీ స్కూలులో ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి చంటి స్కూల్‌కి 9 కుర్చీలు అందించారు.

పెంటపాడు: ఫిజియోథెరపీ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం డాక్టర్ అల్లు శ్రీకృష్ణమహేష్ నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని ఆయన పరిశీలించి మాట్లాడుతూ మాటలు రాని విద్యార్థులకు స్పీచ్ థెరపీ ద్వారా మాటలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయినులు మస్తాన్‌బీ, వి.సునీత తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

మొగల్తూరు, జూలై 9: మొగల్తూరులోని పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదాన అభివృద్ధికి పూర్వ విద్యార్థులు వితరణ చాటారు. కొద్దిపాటి వర్షానికే పాఠశాల ప్రాంగణం మునిగిపోతున్నది. దీంతో మొగల్తూరు పంచాయతీ పాలకవర్గం స్పందించి 200 ట్రిప్పుల ఇసుకను మైదాన పూడికకు చేరవేశారు. అలాగే పూర్వ విద్యార్థులు కూడా ముందుకు వచ్చారు. 1988-89 బ్యాచ్ విద్యార్థులు న్యాయమూర్తి గుబ్బల చంద్రమౌళేశ్వరీ, సింగపూర్‌లో ఉన్న శాస్త్రవేత్త రాయుడు చంద్రశేఖర్, అనంతపల్లి కృష్ణ రూ.10వేలు చొప్పున, అనంతపల్లి కిరణ్, రాజాపండు, కుక్కల శివశంకర ప్రసాద్ రూ.5వేలు చొప్పున ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాన్ని మార్చాలి

మొగల్తూరు, జూలై 9: రామన్నపాలెం పంచాయతీ పరిధి లక్కువారితోటకు పోలింగ్ కేంద్రాన్ని మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. లక్కువారితోట ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు 3 కిలో మీటర్ల దూరం వెళ్ళాల్సి వస్తుందన్నారు. లక్కువారితోటలోనే ప్రాథమిక పాఠశాల ఉన్నందున ఇక్కడ పోలింగ్ కేంద్రాన్ని మార్చాలని కోరుతూ నరసాపురం సబ్ కలెక్టర్‌కు అడ్డాల రాంబాబుకు వినతి అందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



పోడూరు, జూలై 9: అంగనవాడీ కార్యకర్తలు, ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పాలకొల్లు ప్రాజెక్ట్ అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు పీతల రాజమణి మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఈమేరకు తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందచేశారు.

విద్యార్థుల సమస్య పరిష్కారం

పెంటపాడు, జూలై 9: పట్టణంలోని యాగర్లపల్లి 25వ వార్డులోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో వర్షపునీటితో ప్రాంగణం బురదమయంగా మారి విద్యార్థులు ఇబ్బంది పడేవారు. విషయాన్ని విద్యార్థులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే బొలిశెట్టి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన మంగళవారం పాఠశాలలో గ్రావెల్, చిప్స్ వేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి వైద్య నిపుణులు

పెంటపాడు, జూలై 9: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 11న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, క్యాన్సర్, గైనకాలజిస్ట్, చిన్నపిల్లలు, గుండెకు సంబంధించిన వైద్య నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా రక్తపరీక్షలు, టూడీ ఎకో, ఈసీజీ, అల్ట్రాసౌండ్ సేవలు ఉచితంగా చేస్తారని ప్రజలంతా వైద్యసేవలు వినియోగించుకోవాలని కోరారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

తణుకు, జూలై 9: నాల్గో అదనపు జిల్లా న్యాయాధికారి సత్యవతి ఆదేశాలు మేరకు మంగళవారం మార్కెట్ ప్రాంతంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటపుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చుని, ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని చెప్పారు. ట్రాఫిక్ ఎస్ఐ జానా సతీష్, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, ముప్పిడి సుబ్బయ్య, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 9: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు దిశగా ప్రయత్నించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బి. హరికుమార్ కోరారు. తాడేపల్లిగూడెంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించి సంఘ సభ్యుల సమస్యలపై చర్చించారు. ఇన్‌కం టాక్స్ దాఖలు చేసుకోవాల్సిన వారు ఈ నెలాకరులోపు రిటర్న్‌లను అందించాలని సూచించారు. కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, కె బాలకృష్ణ, కె సూర్రెడ్డి, పి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సందర్శన



పోడూరు, జూలై 9: పోడూరు ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నరసాపురం డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ప్రసాదు సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలను, మందుల పంపిణీని పరిశీలించారు. వివిధ రకాలు నిర్వాహణా రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో గర్భిణుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను ఆయన పరిశీలించారు. మిషన్‌ను నిర్వహించే గైనకాలజిస్టు పోస్టు లేదని సిబ్బంది తెలపడంతో పెనుగొండ పీహెచ్‌సీలో పనిచేస్తున్న గైనకాలజిస్టును తాత్కాలికంగా నెలకు రెండు రోజులు పాటు వచ్చి నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగితెలుసుకున్నారు. 41మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుప్రజ, డాక్టర్ శ్రీవాసవి వివరించారు.